# నగరంలో జోరుగా అభివృద్ధి పనులు



నగరంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

- అన్ని డివిజన్లలో కొనసాగుతున్న పనులు
- త్వరగా పూర్తి చేసేందుకు అధికారుల చర్యలు

కార్పొరేషన్, డిసెంబర్ 3: కరీంనగర్‌లోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న పనులు ఎన్నికల సమయంలోనూ సాగుతూనే ఉన్నాయి. రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నగరంలో అభివృద్ధి పనులకు రూ.133 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో నగరంలోని 60 డివిజన్ల పరిధిలో అంతర్గత రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా పైపులైన్ పనులకు సంబంధించి నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నిధులతో చేపట్టే అన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసిన అధికారులు గత నవంబర్‌లోనే ఈ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈ పనుల శంకుస్థాపన సమయంలోనే మంత్రి గంగుల కమలాకర్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే నగరంలోని అత్యధిక డివిజన్లలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో పాటు పలు డివిజన్లలో ఇప్పటికే తుది దశకు చేరాయి. మరోవైపు నగరపాలక సంస్థ అధికారులు సైతం ఈ అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

### మెరుగవుతున్న మౌలిక సదుపాయాలు

నగరంలో ఈ నిధులతో చేపడుతున్న పనుల్లో పలు డివిజన్లను కలుపుతూ చేపడుతున్న లింక్ రోడ్లతో పాటు అంతర్గత రోడ్లకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రతి డివిజన్‌లో మట్టి రోడ్లు లేకుండా చేయాలన్న ఆలోచనతోనే ఈ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేసి పనులు ప్రారంభించారు. ముఖ్యంగా నగరంలోని కశ్మీర్‌గడ్డ రైతుబజార్ నుంచి జ్యోతినగర్‌లోని మోర్ సూపర్ మార్కెట్ వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అలాగే, ఇతర లింకు రోడ్లు కూడా అధికారులు వేగంగా చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు పలు డివిజన్లలో సైడ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి పనులు సాగుతున్నాయి. అని రోడ్లలోనూ ఎక్కువ సైడ్ డ్రైనేజీలను అండర్ గ్రౌండ్‌గా చేపట్టే దిశగానే అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెడుతున్నారు. వీటితో ముఖ్యంగా దోమలతో ఇబ్బందులు, పందుల బెడద కూడా తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా వేగంగా పనులు పూర్తి చేసి వచ్చే రెండు నెలల్లో ఈపనులన్నింటినీ పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



భాగ్యనగర్‌లో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

# దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

- ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం
- సమస్యలపై పోరాటంలో ముందుంటాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 3: కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దేశం గర్వించే స్థాయిలో నిలిచిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సాధనే ధ్యేయంగా కేసీఆర్ నాడు యావత్ ప్రజలందరినీ ఏకం చేసి, అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని సాధించారన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే మార్గదర్శకంగా నిలిపారని కొనియాడారు. రైతాంగానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధు అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు అని పేర్కొన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. ఆసరా పింఛన్‌తో ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను ఆదుకున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య సహకారం అందించారన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించారన్నారు. ఆటో డ్రైవర్లు, గీతా కార్మికుల పన్నులను ఎత్తివేసి ఆయా వర్గాల కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. కులవృత్తులకు ఆదరణ కల్పించి ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. ప్రజల తీర్పును తాము శిరసావహిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఉద్యమ కాలం నుంచి ప్రజల కోసం బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేటీఆర్ విజయంలో భాగస్వాములైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, కేటీఆర్ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలతోపాటు విజయంలో భాగస్వాములైన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో రాష్ట్రం విశేష అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి అభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు కల్వకుంట్ల గోపాల్‌రావు, సత్తార్, మ్యాన రవి, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



కోడెమొక్కు తీర్చుకుంటున్న భక్తులు

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

- 25 వేలకు పైగా భక్తుల రాక
- రాజన్నకు రూ.17 లక్షల ఆదాయం
- కోడె మొక్కు చెల్లింపు

వేములవాడ టౌన్, డిసెంబర్ 3: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజామునే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరించారు. కొంత మంది భక్తులు కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించుకున్నారు. జిగ్‌జాగ్ క్యూలో నిలబడి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే, ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు, గండదీపం, కల్యాణ మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు, చండీహోమాలు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు రూ.17 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 25 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

## యాదవ సంఘం కార్యవర్గం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3: నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎలిమి రమేశ్, ఉపాధ్యక్షుడిగా జంగ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా మెరుగు మల్లయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా జంగ శ్రీనివాస్, సలహాదారుగా కాశవేణి సంజీవ్ ఎన్నికయ్యారు.

## పలువురికి గాయాలు

రాంనగర్, డిసెంబర్ 3: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల కౌంటింగ్ కేంద్రం సమీపంలో పాడి కౌశిక్‌రెడ్డి అనుచరులు గెలుపు సంబురాలు జరుపుకొంటుండగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. పట్టించుకోకపోవడంతో పాడి కౌశిక్‌రెడ్డికి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసుల ఆదేశాలు పట్టించుకోకపోవడంతో విధుల్లో ఉన్న సిబ్బంది సీపీకి సమాచారం అందించారు. పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన కౌశిక్‌రెడ్డిని పోలీసులు నెట్టివేశారు. కాగా, ప్రత్యేక బృందంతో అక్కడి చేరుకున్న సీపీ అభిషేక్ మహంతి లాఠీచార్జి చేసి గుమిగూడిన కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ క్రమంలో పలువురు కార్యకర్తలు పరుగులు తీయగా గాయాలయ్యాయి.

## ఈ విజయం ప్రజలదే

వేములవాడ, డిసెంబర్ 3 : ఈ ఎన్నికలో గెలుపు ప్రజలదేనని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికి నాలుగు సార్లు ఓటమిపాలైనప్పటికీ అధికారం, పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజలలో ఒకడిగా ఉన్నానని చెప్పారు. ఇది గుర్తించిన ప్రజలు కృతజ్ఞతగా తనకు ఎమ్మెల్యేగా పట్టం కట్టారని తెలిపారు. 30 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజల సమస్యలపై పోరాడుతున్న తనకు ప్రతి అంశం, ప్రతి సమస్యపై అవగాహన ఉందని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతున్నందున ప్రతి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా 6 గ్యారంటీలను అమలు చేసి తీరుతామని, ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తామని తెలిపారు.